ఆధునిక బానిస విధానం

# భారతదేశపు అర్థవలస- అర్థభూస్వామ్య స్వభావాన్ని నిర్ధారిస్తున్న వైనం

**వాక్** ఫ్రీ ఫౌండేషన్ అనే సంస్థ ప్రపంచ బానిస విధాన సూచి – 2016ను విడుదల చేసింది. మొత్తం 25 దేశాల్లో, 53 భాషల్లో 42 వేల ఇంటర్వ్యూలు నిర్వహించిన తదనంతరం ఈ సూచీని విడుదల చేసింది. ఇందులో భాగంగా భారతదేశంలో కూడా 15 రాష్ట్ర స్థాయి సర్వేలు నిర్వహించారు.

ఈ సూచీ అనేక విషయాలను వెల్లడి చేసింది. ఆధునిక బానిసత్వంలో, బహిరంగంగా కనిపిస్తూ, పైకి కనిపించకుండా కూడా చాలా అమానవీయమైన రూపాల్లో ప్రజలు హింసకు గురవుతున్న విషయంలో భారతదేశం మొదటిస్థానంలో వుంది. పురుషులు, స్త్రీలు, పిల్లలు మొత్తం 18.35 మిలియన్ల మంది భారతదేశంలో ఆధునిక బానిసత్వంలో చిక్కుకొని వున్నారని ఈ సర్వే నివేదిక అంచనా వేసింది.

ఆధునిక బానిసత్వం యొక్క బాధితుల సంఖ్య 2014లో 14.3 మిలియన్లు ఉండగా అది 2016 నాటికి 18.35 మిలియన్లకు పెరిగిపోయిందని కూడా ఈ రిపోర్టు వెల్లడి చేసింది. ఇది మన సమాజంలో గత రెండు సంవత్సరాలుగా సామాజిక ఆర్థిక రంగాల్లో సాధించిన "అభివృద్ధి" అన్నమాట! మోడీ ప్రభుత్వం నాయకత్వంలో ఎన్.డి.ఎ. పాలకులు సాధించామని ప్రచారం చేసుకొంటున్న అభివృద్ధి యొక్క అసలు రూపం ఇదే.

భారతదేశంలో ఆధునిక బానిసత్వం వివిధ రూపాల్లో కొనసాగుతోంది. వ్యభిచారంకోసం మానవ అక్రమరవాణా రూపంలో, నిర్బంధ చాకిరీ రూపంలో, అప్పుతీరే వరకూ నిర్బంధంగా చాకిరీ చేయటం రూపంలో, బలవంతపు వివాహాల రూపంలో ఇది అమలవుతున్నది.

మనదేశంలో వ్యవసాయరంగం తీవ్రమైన సంక్షోభంలో వుంది. తద్వారా గ్రామీణ ప్రాంతాలు కూడా సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయి. ఈ స్థితిలో గ్రామీణ శ్రామిక జనం ఉపాధికోసం ఇటుక బట్టీల్లో, మరబోట్లలో, నిర్మాణ రంగంలో, వస్తు తయారీ రంగాల్లో నిర్బంధ శ్రామికులుగా మారక తప్పని స్థితికి నెట్టబడ్డారు. గ్రామీణ రుణభారం అనేది రుణగ్రస్తమైన కుటుంబాల్లో భార్యలను, పిల్లలను బాలకార్మికులుగా, నిర్బంధ శ్రామికులుగా పనికి నెట్టింది. గ్రామీణ పేదరికం వల్ల ఆడపిల్లలు వ్యభిచార కొంపలకు అమ్ముడు పోవటమో, లేకపోతే వ్యవసాయ క్షేత్రాల్లో బానిస కూలీలుగా మారటమో జరగక తప్పటంలేదు. గ్రామాల్లో నెలకొని ఉన్న దుర్భర పరిస్థితుల ఫలితంగా ఆడపిల్లలు, మహిళలు సెక్స్ మాఫియా రాకెట్ల చేతికి చిక్కి అత్యంత హీనంగా, ఘోరంగా వంచించ బడుతున్నారు. చివరికి ఆధునిక కార్పొరేట్ ఉద్యోగ రంగంలో కూడా అమానవీయ, భూస్వామ్య విధానాలు, నిర్బంధంగా చాకిరీ చేయించటం చాలా ఎక్కువగా ఉన్నాయి. ఇటీవల ఎగుమతి ఆధారిత దుస్తుల పరిశ్రమరంగంలో మహిళా కార్మికుల అనుభవాలు దీనినే రుజువు చేశాయి. ఇంటి పనిమనుషులు ఆధునిక బానిసత్వంలో చెప్పలేనన్ని రకాలుగా వేధింపులకు గురవుతున్నారు.

వ్యక్తులు, నేరస్థగుంపులు, కుటుంబాలు, వ్యాపార సంస్థలు, గ్రామీణ పట్టణ ప్రాంతాల్లోని పెత్తందార్లు, కార్పొరేట్ రంగంలో కార్మికుల్ని హింసించి పనిచేయించుకొనే అన్యాయమైన పద్ధతులు, నిర్బంధిస్తామని భయపెట్టటం, మోసం చేయటం, అధికారం ఉపయోగించటం తదితర కారణాల నేపథ్యంలో ప్రజలు బానిసత్వపు వలలో చిక్కుకొని, స్వతంత్రతను కోల్పోయి, దానినుండీ బైటపడలేని దుస్థితిలో మగ్గిపోతున్నారు.

భారతదేశంలో అమలవుతున్న ప్రజావ్యతిరేక రాజకీయ విధానాలు, అభివృద్ధి నిరోధక సామాజిక – సాంస్కృతిక, ఆర్థిక, భూస్వామ్య విధానాలు ఈ ఆధునిక బానిసత్వానికి కారణం. ఆర్థిక సంస్కరణలు పూర్తిగా విఫలమవటం, ప్రత్యేకించి ఆర్థిక, సాంస్కృతిక, శ్రామిక రంగాలలో భూస్వామ్య విధానాలను రూపుమాపటంలో ఈ ఆర్థిక సంస్కరణలు పూర్తిగా విఫలం కావటం కూడా ఆధునిక బానిసత్వానికి హేతువు.

సామ్రాజ్యవాద ప్రభువుల ఆదేశాల కనుగుణంగా మన పాలకవర్గాలు, పాలకులు మహోత్సాహంతో భారతదేశంలో అమలుచేసిన నయాఉదారవాద ఆర్థిక విధానాలు భారతదేశపు అర్థవలస – అర్థ భూస్వామ్య వ్యవస్థయొక్క మౌలిక స్వభావాన్ని ఏమాత్రం మార్చలేదు. పైపెచ్చు 1947 అధికార మార్పిడి కాలం నుండీ నేటి వరకూ ఈ వ్యవస్థ యొక్క దోపిడీ స్వభావాన్ని మరింత బలపరుస్తూ, విస్తృత పరుస్తూ వచ్చాయి.

సంకుచితత్వానికి, తిరోగామి సామాజిక – సాంస్కృతిక, ఆర్థిక విధానాల అమలుకు ప్రతిరూపంగా ఆధునిక బానిసత్వ విధానం భారతదేశంలో చాలా ప్రబలంగా వున్నది. ఇది భారతదేశం సామాజిక వ్యవస్థ యొక్క అర్థవలస, అర్థభూస్వామ్య స్వభావాన్ని మరొకసారి నిర్ధారిస్తున్నది. నూతన ప్రజాతంత్ర విప్లవ ఆవశ్యకతను మరింతగా నొక్కిచెప్తున్నది.

oooooo